
సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 23 । నవంబర్ । 2024



పత్తికి మద్దతు కరువు

పత్తి రైతుకు మద్దతు కరువైంది. ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదు.

- 8లో



చెరుకు తోట దగ్ధం

మాకివలస–కిల్లాం మధ్య చెరుకు తోట దగ్ధమైంది. రూ.8లక్షల వరకు నష్టం వాటిల్లింది.

- 8లో

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా తెలిపారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుందని, ఉమ్మడి జిల్లా ప్రభుత్వ శాఖాధికారులంతా తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

న్యూస్‌రీల్

శబరిమలకు ప్రత్యేక బస్సులు



శబరిమలకు వెళ్లే బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: శబరిమలకు వెళ్లేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు హనుమంతు అమరసింహుడు, కెఆర్ఎస్ శర్మలు తెలిపారు. శబరిమలకు వెళ్లే ఆర్టీసీ ప్రత్యేక బస్సును శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శబరిమలకు వెళ్లేందుకు శ్రీకాకుళం జిల్లా నుంచి ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ అందుబాటులోకి తెచ్చిందన్నారు. భక్తులు బస్సు మొత్తం లేదా విడివిడిగా టికెట్‌లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. బస్సు మొత్తం బుక్ చేసుకుంటే ఏడుగురు స్వాములకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. అలాగే 5రోజుల టూర్, 6రోజుల టూర్, 7రోజుల టూర్ ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. శబరిమలకు వెళ్లే భక్తులు ఈ కింది నంబర్లను సంప్రదిస్తే 'ఒక్క ఫోన్ కాల్ తో మీ వద్దకు ఆర్టీసీ బస్సు' అనే నినాదంతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 9959225611 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ప్రసాద్, ఎం.పీ.రావు, రాజు, సెక్యూరిటీ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు ఉచిత ఆరోగ్య కార్డులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో ప్రతి హోంగార్డు నుంచి పోలీసు అధికారి వరకూ అందరికీ ఉచిత ఆరోగ్య కార్డులు జారీ చేయనున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. రాగోలు జెమ్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమానికి కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత బొల్లినేని భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసు ఉద్యోగులు వంద రూపాయలు కడితే కార్డు తీసుకోవచ్చునని, అదనంగా ఏ వ్యాధికు గురైనా ఎలాంటి నగదు చెల్లించకుండా అన్ని రకాల వైద్య పరీక్షలు కూడా కుటుంబ సభ్యులు సైతం ఉచితంగా చేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు సుగర్, బీపీ, ఈసీజీ, టూడీ ఎకో, గుండెకు సంబంధించిన పరీక్షలను జెమ్స్ వైద్యులు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గల రెండువేల మంది పోలీసులకు ఒకే దశలో వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించినందుకు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి పోలీసుకు వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ.100 చెల్లించి ఆరోగ్య కార్డులను తీసుకుంటామన్నారు. కిమ్స్ అధినేత బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది భవిష్యత్‌లో ఎలాంటి రుసుం చెల్లించకుండా జెమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, రాజశేఖర్, శేషాద్రి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మూడు నెలల వరకు పింఛన్ తీసుకోవచ్చు



శ్రీకాకుళం పాతబస్టాండ్: సామాజిక భద్రతా పింఛన్లలో భాగంగా ఎవరైనా పింఛన్ తీసుకోకపోతే మూడు నెల్లోగా అలాంటి వారు పింఛన్ తీసుకోవచ్చని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. ప్రతి నెల సకాలంలో వివిధ కారణాల వల్ల పింఛన్ తీసుకోలేని వారికి ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. గత నెలలో జిల్లాలో పింఛన్ తీసుకోని వారు 2782 మంది ఉన్నారని, వీరిలో 1054 మంది మరణించారని, మిగిలినవారు వారి పింఛన్ మూడు నెలల్లోగా పొందవచ్చని ఆయన వివరించారు.

మోసం గురూ..

- రైతన్నకు అందని అన్నదాత సుఖీభవ
- రెండు విడతలకు గాను రూ.235కోట్లు బకాయి
- జిల్లా వ్యాప్తంగా 3.13లక్షల మంది రైతులకు అందని సాయం
- ఖరీఫ్ ముగిసినా పైసా విదల్చని కూటమి ప్రభుత్వం





శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవ అని మార్చారు. నగదు సాయం మొత్తాన్ని పెంచుతామని మాటిచ్చారు. ఆ మేరకు ఊరూరా తిరిగి మైకుల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ కాగితాలు ప్రింట్ చేసి మరీ ఇచ్చారు.. అంతే అక్కడితో టీడీపీ నాయకుల కసరత్తు ఆగిపోయింది. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను మర్చిపోయారు. దమ్ములు, ఊభాలు, కలుపు తీత, ఆఖరకు కోతలు కూడా పూర్తయిపోతున్నా.. అన్నదాత సుఖీభవ పథకంలో దమ్మిడీ కూడా విడుదల చేయలేదు. ఈ సాయమే కాదు ఎరువులు, విత్తనాల పంపిణీలోనూ రైతన్నకు నిలువెత్తున మోసం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3.13 లక్షల మంది రైతులకు గాను రెండు విడతలు కలిపి రూ.235కోట్లు బకాయి పడ్డారు. ఈ ఏడాది మూడు విడతలు గాను మొత్తంగాను రూ.423కోట్లు బకాయిపడే అవకాశం ఉంది.

కేంద్రం ఇస్తున్నా..

ఖరీఫ్ సాగు సమయంలో మొత్తం రెండు విడతలుగా రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం తన వాటాగా రెండు విడతలు రూ.4వేలు చొప్పున డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నగదుపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. దీనిపై చంద్రబాబు సర్కారు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా విడుదల కాకపోవడంతో ఆశలు ఆవిరైనట్లేనని అన్నదాత ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అలా..

ఖరీఫ్ సీజన్ లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గత వైఎస్ జగన్ సర్కార్ సాగుకు ముందే పెట్టుబడి సాయం ఆందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. ఇందులో కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇచ్చే రూ.6 వేలకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 కలిపి మొత్తంగా రూ.13,500 చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేసేది. జిల్లాలో 3.22లక్షల మంది రైతులుండగా గత ఐదేళ్లలో కేవలం వైఎస్సార్ రైతు భరోసా ద్వారానే రూ 1983.73కోట్లు లబ్ధి అందించింది. ఖరీఫ్ పంట వేసేముందు ఏటా సరిగ్గా మే నెలలో రూ.7,500 జమ చేసేది. తర్వాత అక్టోబర్ నెలలో ఖరీఫ్ పంట కోతతో పాటు రబీ సాగు అవసరాల కోసం రెండో విడతలో రూ.4 వేలు ఇచ్చేది. ఆ తర్వాత జనవరి నెలలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతి పండుగ సమయంలో మరో రూ.2 వేలు... ఇలా మూడు విడతల్లో ఒక్కో రైతుకు 'వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్' ద్వారా మొత్తం రూ.13,500 చొప్పున గత ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేసింది. వైఎస్సార్ రైతు భరోసా పథకంతో పాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా అనేక పథకాల ద్వారా గత ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది.

రైతన్నను ఆదుకుంటాం



రైతును అన్ని రకాలుగా ఆదుకునేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాల్లో త్వరలో డబ్బులు జమ చేస్తాం. ఇప్పటికే పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగింది.

– కోరాడ త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

రైతంటే చిన్నచూపు తగదు



రైతుకు విత్తనం వేసిన నుంచి పంట చేతికి వచ్చినంత వరకు భయం భయంగానే ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అలాంటి భయం ఉండేది కాదు. పంటలు వేసేందుకు దుక్కిన నాటి నుంచి కోత కోసిన వరకు అన్ని సందర్భాల్లో ప్రభుత్వం రైతుభరోసా పేరిట డబ్బులు వేసి చేయూతనిచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చి ఖరీఫ్ సీజన్ పూర్తయినా నేటికి దిక్కులేదు.

– ఇసురు యాదవరెడ్డి, ఇన్నిసుపేట, ఇచ్ఛాపురం మండలం

మోసకారి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల్ని మోసం చేస్తునే వస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే రైతుల ఖాతాల్లో రెండు విడతలు డబ్బులు జమయ్యేవి. ఇప్పటివరకు ఎలాంటి విధివిధానాలు లేకపోవడం దారుణం.

– నక్క ఆనందరావు, రైతు, హిరమండలం

వైఎస్సార్‌సీపీ 5 ఏళ్లలో రైతులకు చేకూర్చిన లబ్ధి	సంవత్సరం	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
	రైతుల సంఖ్య (లక్షల్లో)	2.58	2.91	3.07	3.10	3.21
	లబ్ధి (రూ.కోట్లలో)	348.50	393.52	414.57	393.14	434



గాజుల అలంకరణలో దుర్గాదేవి



రణస్థలం మండలం వల్లభరావుపేటలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం వేలాది గాజులతో అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

– రణస్థలం

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు'



చాపరలో నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల మహిళలు

మెళియాపుట్టి: ప్రేమ పేరుతో విశాఖలో 'లా' విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం శ్రీకాకుళం జిల్లాకార్యవర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ శుక్రవారం చాపర గ్రామంలో పలు సంఘాల మహిళలతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఇటీవల ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య మరువకముందే మళ్లీ విశాఖలో న్యాయ విద్యార్థినిని ప్రేమపేరుతో దారుణంగా అత్యాచారం చేసిన ఘటన జరగడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణలేదని తెలుస్తోందని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై సామాజిక స్పృహను పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘం నేత కె.సూరయ్య, పోలాకి ప్రసాదరావు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి పలు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే అజెండా

- అందరం కలిసికట్టుగా పనిచేద్దాం
- వైఎస్సార్ సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేయడమే అజెండాగా, పార్టీ క్యాడర్ అంతా కలిసికట్టుగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయం ఆవరణలో శుక్రవారం పార్టీ క్యాడర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ సీనియర్ నాయకులు విజయసాయిరెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం నోరు నొక్కుతోందని, ఎంత అణగదొక్కినా తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం నియోజకవర్గానికి సముచిత స్థానం కల్పించిందని పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా కేవీజీ సత్యనారాయణ, నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించడమే అందుకు నిదర్శనమన్నారు. స్థానిక ఎమ్మెల్యే అధికారం చేపట్టిన తర్వాత కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించడం, బదిలీలు చేయించడం, రాజకీయ కక్షతో పింఛన్లు తొలగింపు చేయడం మాత్రమే చేశారని దుయ్యబట్టారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ మాట్లాడుతూ అధిష్టానం సూచించిన వారికి తాము మద్దతుగా నిలబడతామన్నారు. సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పార్టీని నడపడం నిజమైన నాయకత్వం అని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ బూర్జ మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, పొందూరు మండల అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ముఖ్య నాయకులు లోలుగు శ్రీరాముల నాయుడు, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, బెవర మల్లేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి అజంతాకుమారి, చింతాడ వెంకటరమణ, దుంపల చింజీవిరావు తోపాటు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు రెండో పంట వేయవద్దు

- వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: జిల్లాలోని రైతులు వరి రెండో పంట వేయవద్దని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకోరారు. ఈ మేరకు విజయవాడ మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వంశధార గొట్టా బ్యారేజీలో ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వ ఉందని, నీటి లభ్యత తక్కువగా ఉన్నందున, శివారు ప్రాంతాల రైతులకు సాగునీరు అందే పరిస్థితి లేదని, అందువల్ల వంశధార కాలువల పరివాహక ప్రాంతాల్లోని రైతులు ఈ సమస్యను అర్థం చేసుకొని రెండో వరి పంట వేయవద్దని ఆ ప్రకటనలో మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.

పోరాటాలు ఉద్ధృతం చేద్దాం



స్మారక స్థూపం వద్ద అమరులకు నివాళులు

పలాస: శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాల స్ఫూర్తిని మదినిండా నింపుకొని నేడు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు తమ పోరాటాలను ఉద్ధృతం చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రతినబూనారు. మర్రిపాడు గ్రామం వద్ద గల జిల్లా అమరవీరుల స్మారక స్థూపం వద్ద సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. బొడ్డపాడు గ్రామానికి చెందిన తామాడ గణపతి అమరత్వం పొందిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి 1969 లో జరిగిన పోరాటంలో అసువులు బాసిన వీరులను తలుచుకొని వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు హేమక్క, జె.అప్పయ్య, పోతనపల్లి మల్లేశ్వరరావు, గర్తం కామేశ్వరరావు, కొల్లి మల్లేశ్, దుబ్బ బారికయ్య, వంకల అప్పయ్య, వంకల కామరాజు, కుత్తుం వినోద్ పాల్గొన్నారు.

అసాధ్యం.. సు'సేద్యం'





రైతు కాయ భీమసేన్

ఓ వైపు పెరుగుతున్న పెట్టుబడి.. మరోవైపు తగ్గుతున్న వానలు.. ఇంకోవైపు సవాల్ విసిరే సాగు పరిస్థితులు. ఇన్ని అవాంతరాల మధ్య కూడా ఆ రైతు విజయం సాధించి చూపించాడు. కొత్త విత్తన రకాన్ని ఎంచుకుని వెద పద్ధతిలో సాగు చేశాడు. కవిటి మండలం కపాసుకుద్ధికి చెందిన సర్పంచ్ కాయ దమయంతి భర్త భీమసేన్ ఆర్‌జీఎల్ 2537 రకం విత్తనాలతో చక్కటి దిగుబడి రాబట్టారు. ఆయన ఈ రకం వరి విత్తనాలు మూడు బ్యాగులు కొనుగోలు చేసి తన ఐదు ఎకరాల పొలంలో వేయడానికి సిద్ధమయ్యారు. వానలు అనుకూలించకపోవడంతో మూడెకరాల్లో వేశారు. ప్రస్తుతం ఈ మూడు ఎకరాల్లో వరిచేనులో ఒక్కో దుబ్బుకు 40 నుంచి 45పిలకలు తొడిగి మంచి వెన్ను వేసింది. మంచి ఆశాజనకమైన దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ చేనును చూసేందుకు పరిసర గ్రామాలకు చెందిన రైతులు భారీగా తరలివస్తున్నారు. రైతులు కాస్త వినూత్నంగా ఆలోచిస్తే తక్కువ పెట్టుబడితో లాభాల బాట పట్టవచ్చని ఆయన చెబుతున్నారు.

– కవిటి

దళితుల ఇంటి నిర్మాణ సామగ్రి లూటీ

- అందరి ముందే దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ నేతలు
- వీడియోలు తీసినా వెరవని వైనం
- దండుగోపాలపురంలో టీడీపీ అరాచకం



మిగిలిన ఇంటి మెటీరియల్స్‌తోనే ఆ ప్రాంతాన్ని చదును చేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి:

దళితులపై టీడీపీ నేతల అరాచకాలు పరాకాష్టకు చేరుకున్నాయి. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి తెచ్చుకున్న మెటీరియల్స్‌ను లూటీ చేసిన సంఘటన దండుగోపాలపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని దండుగోపాలపురం గ్రామంలో వైఎస్ జగన్ హయాంలో సర్వే నంబర్ 214–3సిలో 23 సెంట్లు ప్రభుత్వ భూమిని పేదల ఇళ్ల నిర్మాణాలకు కేటాయించారు. వీరిలో కొందరు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయగా, మరికొందరు నిర్మాణాలను కొంత మేరకు చేపట్టారు. మిగతా నిర్మాణాలు పూర్తి చేయడానికి లబ్ధిదారులు బస్వల తులసి, బస్వల మహాలక్ష్మి, గుజ్జు ఆరుద్ర, నౌపడ తవిటమ్మలు జగనన్న కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో 8 లోడుల ఇసుక, ఐదు లోడుల ఇటుక, నాలుగు లోడుల చిప్స్, రెండులోడుల బెండడి రాయి మెటీరియల్స్‌ను నిల్వ ఉంచారు. అయితే మెటీరియల్ వేసిన ప్రభుత్వ స్థలంపై టీడీపీ నేతల కన్ను పడింది. వెంటనే అధికారాన్ని ఉపయోగించి లబ్ధిదారులకు ఎలాంటి సమయం ఇవ్వకుండా తమ ప్రతాపం చూపారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు మెటీరియల్ లూటీ చేయడానికి ప్రయత్నించగా లబ్ధిదారులు అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీసులు సమక్షంలో ఈ తతంగమంతా జరిగినా ఎవరూ ఏమీ అనకపోవడంతో లబ్ధిదారులు భయాందోళన చెందారు. లబ్ధిదారులు సెల్‌ఫోన్‌లో వీడియోలు తీస్తే వీడియోలు తీసినా, ఎవరికి చెప్పినా ఏమీ చేయలేరని టీడీపీ నేతలు హెచ్చరించారు. ఇక్కడే ఉంటే పెట్రోల్ పోసి తగలబెడతామని తమను బెదిరించారని బాధితులు తెలిపారు. అదే రోజు రాత్రి ఇసుక, ఇటుక, చిప్స్‌ను ట్రాక్టర్ ద్వారా స్థానిక టీడీపీ నేతలు పొందర సురేష్, సురేష్, విష్ణుమూర్తి, సూరి, బాలక నారాయణలు తరలించుకొని పోయారని తెలిపారు. మిగిలిన మెటీరియల్స్‌ను చదును చేశారు. సుమారు ఐదు లక్షల విలువ చేసే మెటీరియల్, లూటీ చేశారని అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

ఐదు లోడుల ఇసుక తీసుకెళ్లిపోయారు



ఇంటి నిర్మాణానికి వేసిన ఐదు లోడ్ల ఇసుకను టీడీపీ నేతలు ట్రాక్టర్ ద్వారా తరలించుకుపోయారు. ఇదేమిటని అడిగితే పెట్రోల్ పోసి తగలబెడతామని బెదిరించారు. దీంతో భయాందోళనతో వెనుతిరిగాము.

– బస్వల తులసి, జగనన్నకాలనీ లబ్ధిదారు, దండుగోపాలపురం

చంపుతామంటున్నారు..



ప్రభుత్వం ఇచ్చిన ఇంటిని నిర్మాణం చేయడానికి తెచ్చిన మెటీరియల్స్‌ను తరలించుకుపోయారు. ఇదేమిటని అడిగితే చంపుతామంటున్నారు. ఇంత దారుణం జరుగుతున్నా అధికారులు స్పందించటం లేదు.

– గుజ్జు ఆరుద్ర, జగనన్న కాలనీ లబ్ధిదారు, దండుగోపాలపురం

మెటీరియల్స్ తీయాలని చెప్పాం

ప్రభుత్వ భూమిలో వేసిన ఇంటి నిర్మాణ మెటీరియల్స్‌ను తీయాలని లబ్ధిదారులకు తెలియజేశాను. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నేతలకు చెప్పాను. అయితే వారు పది రోజులైనా తీయరని టీడీపీ నేతలు సమాధానం ఇచ్చారు. దీంతో పోలీసుల సమక్షంలో మెటీరియల్స్‌ను తరలించారు.

– సీరపు వైకుంఠరెడ్డి, వీఆర్వో, దండుగోపాలపురం

క్లుప్తంగా

మహిళా క్రికెట్ కోచ్‌గా దమయంతి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా క్రికెట్ సంఘం పరిధిలోని ఇచ్ఛాపురం సబ్–సెంటర్‌కు మహిళా క్రికెట్ కోచ్‌గా మైలపల్లి దమయంతిని నియమించినట్లు జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ శుక్రవారం తెలిపారు. దమయంతి అంతకుముందు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థల్లో క్రికెట్ కోచ్‌గా పనిచేశారు.

వెయిట్‌లిఫ్టింగ్ రిఫరీగా అప్పన్న



శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు రిఫరీగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్ ఇప్పిలి అప్పన్న నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం శాప్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 4 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. అప్పన్న నియామకం పట్ల డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, వెయిట్‌లిఫ్టింగ్ సంఘ ప్రతినిధులు, కోచ్‌లు హర్షం వ్యక్తంచేశారు.

జిల్లా సీనియర్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఆర్చరీ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి లోపింటి చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయానికి వెనుకన ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఇక్కడ ఎంపికైన వారిని చిత్తూరు జిల్లా చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో డిసెంబర్ 3 నుంచి 5 వరకు జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 4 పాస్ ఫొటోలు, ఎంట్రీ ఫీజు తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 94406 77201, 99899 78727 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయసేవలు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గార: జైలులో ఉండే ముద్దాయిలు, ఖైదీలకు న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీనియర్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం అంపోలు జిల్లా జైలులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. బెయిల్‌కు సంబంధించి ప్రతివారం న్యాయవాదులు, పారా వలంటీర్లను పంపిస్తామని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం లైబ్రరీ, వంటగదులు, మహిళా బ్యారక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ వి.సన్యాసిరావు, దివాకర్ నాయుడు, అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

నేడు రైల్వే గేట్లు మూసివేత

టెక్కలి: నౌపడ–గుణుపూర్ మార్గంలో టెక్కలి మండలం తలగాం, తొలుసూరుపల్లి వైపు ఉన్న రైల్వే గేట్లను శనివారం మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వై.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గేట్లు మూసివేసి ట్రాక్ సామర్థ్యం పనులు చేపడతామని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

పాత విధానంలోనే వైద్య సౌకర్యాలు అందించాలి



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు రిఫరల్ ఆసుపత్రుల ద్వారా కాకుండా ఈహెచ్‌ఎస్ కేటాయించడంతో సరైన వైద్య సౌకర్యాలు అందక ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పరిశీలనలో ఉన్న పీటీడీ ఉద్యోగుల పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. 10 వేల ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈయూ జోనల్ సెక్రటరీ భాసురు కృష్ణమూర్తి మాట్లాడుతూ 2017 పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో ఈయూ జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ఆర్.శర్మ, 1, 2 డిపోల నాయకులు ఎస్.వి.రమణ, బి.ఆర్.కృష్ణ, కె.జి.రావు, సభ్యులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు మద్దతు కరువు



కొత్తూరులో పత్తిని తూకం వేస్తున్న దృశ్యం

- గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు
- నాసిరకం విత్తనాలతో తగ్గిన దిగుబడులు
- ప్రభుత్వం నుంచి అందని సాయం

కొత్తూరు: తెల్ల బంగారంగా పిలిచి పత్తి పంట రైతులకు నష్టాలను మిగుల్చుతోంది. జిల్లాలో కొత్తూరు, హిరమండలం, లావేరు, బూర్జ, సంతకవిటి, రణస్థలం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, జి.సిగడాం, పొందూరు తదితర మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. గతంలో ఎకరాకు సుమారు 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చేది. ఈ ఏడాది నాసిరకం విత్తనాల కారణంగా పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీనికి



నాసిరకం విత్తనాల కారణంగా దిగుబడి లేని పత్తిపంట

తోడు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎకరాలకు 4 క్వింటాళ్లు కూడా దిగుబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన సాగు భారం

ఎకరా పత్తి పంట సాగు చేయాలంటే సుమారు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో యూరియా రూ.280, డీఏపీ రూ.1285తో పాటు పలు రకాల ఎరువులు తక్కువ ధరలకే లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ ఏడాది యూరియా రూ.400, డీఏపీ రూ.1600కు చేరడం, పురుగు మందులను 30 శాతం రేట్లు పెంచి విక్రయాలు చేపట్టారు. దీంతో రైతులపై అదనపు భారం పడింది. కూలీ రేట్లు సైతం పెరిగిపోయాయి.

కానరాని మద్దతు..

గత ఏడాది నవంబర్‌లో గుంటూరు, రాయగడ, గుణుపూర్‌లు నుంచి వచ్చిన ప్రైవేట్ వర్తకులు క్వింటా పత్తిని రూ.6800 నుంచి రూ.7000 వరకు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.6300 దాటం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7550 రైతుల దరి చేరడం లేదు. గత ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రూ.13 వేలు సాయం అందజేసేది. ఈ మొత్తం పత్తి పంటకు పెట్టుబడిగా పెట్టేవారు. ఈ ఏడాది పెట్టుబడి సాయం కింద అందజేస్తామన్న రూ.20 వేలు ఇంత వరకు విడుదల చేయకపోవడంతో రైతులు మరింత అప్పుల్లో కూరుకుపోతున్నారు.

గిట్టుబాటు లేదు..



పత్తి పంట గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు. పెట్టుబడులు పెరిగిపోయాయి. దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

– పెద్దకోట జగన్నాథం, పత్తి రైతు, కల్లెమ్మ గ్రామం, కొత్తూరు మండలం

కేంద్రాలు తెరవాలి..



కొత్తూరు మండలంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడే ఈ ప్రాంత పత్తి రైతులకు మద్దతు ధర లభిస్తుంది. లేకపోతే వ్యాపారులు ఎంత చెబితే అంతకే అమ్మాల్సి వస్తుంది.

– లోతుగెడ్డ గోవిందరావు, పత్తి రైతు, కొత్తూరు

మా పొట్ట కొట్టే ఎయిర్‌పోర్టు వద్దు



ఎయిర్ పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా సమావేశమైన ఉద్దాన రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ: మందస, వజ్రపుకొత్తూరు మండలాల సరిహద్దు ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఉద్దాన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఓ వైపు కేంద్ర బృందం(ఏఏఐ) స్థల పరిశీలన చేస్తుంటే.. మరో వైపు స్థానిక ఉద్దాన రైతులు నుంచి వ్యతిరేక సెగలు మొదలయ్యాయి. ఆయా మండలాల సరిహద్దు గ్రామాల్లో రైతులు చర్చలు జరిపి మందస మండలం రాంపురం పంచాయతీలో శుక్రవారం ఉద్దాన రైతులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎయిర్ పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్దాన రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉద్యాన పంటలను నమ్ముకొని పిల్లాపాపలతో జీవనోపాధి సాగిస్తున్నామని చెప్పారు. తాము నమ్ముకున్న భూమిని వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మాకు నష్టం కలిగించే ఎలాంటి ఎయిర్‌పోర్టులు వద్దు.. మా భూములే ముద్దు అంటూ ముక్తకంఠంతో నినదించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకులం కాదని.. అయితే మాకు నష్టం కలిగించే అభివృద్ధి మా ప్రాంతంలో వద్దు అని స్పష్టం చేశారు. ఈ మేరకు పరిసర ప్రాంతాల రైతులతో కలిసి తీర్మానం చేశారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయండి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఆఫీస్ బేరర్ బి.మురళి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం సర్వజనాసుపత్రి వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంపద సృష్టించే కార్మిక వర్గాలను విస్మరించి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో రిమ్స్ నాయకులు



రిమ్స్ వద్ద కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

ఎం.సూర్యనారాయణ, ఆర్.చిన్నారావు, కె.రవి, బి.శ్రీను, రాజేంద్ర, అన్నాజీరావు, రాజు, టి.కుమారి, జి.సుశీల, ఎన్.దమయంతి, ఆర్.రోజా, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష ఎకరాల్లో ప్రకృతి సేద్యం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల రెండో విడత శిక్షణను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 42వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు సాగవుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో లక్ష ఎకరాల్లో సాగు చేయాలన్నారు. మూడేళ్లలో 80 శాతం రసాయిన ఎరువులు, పురుగుల మందులు వినియోగం తగ్గాలని చెప్పారు. 70 వేల మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై శిక్షణ లక్ష్యంగా కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. వ్యవసాయ యాజమాన్య ఖర్చులు తగ్గించి.. కషాయాలు, ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం వంటి వినియోగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ పి.రేవతి, అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 10 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 10 నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శక్రవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.30, పరీక్ష ఫీజు రూ.770, ప్రాక్టికల్స్ ఫీజు రూ.250 కలిపి మొత్తం రూ.1050 ఈ నెల 30లోపు చెల్లించాలని సూచించారు. గడువు దాటితే అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

స్టూడెంట్ నెంబర్-1



కొత్తూరు మండలం వీరనారాయణపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం ఒక్క విద్యార్థిని గ్రీష్మ(ఒకటో క్లాస్) మాత్రమే చదువుతోంది. గతంలో ఇక్కడ తొమ్మిది మంది విద్యార్థులు ఉన్నా అందులో 3, 4, 5వ తరగతుల విద్యార్థులు మాతల హైస్కూల్‌కు వెళ్లిపోయారు. దీంతో ఒక్క స్టూడెంటే మిగిలింది. ఉపాధ్యాయుడు ఈశ్వరరావు ఈ ఒక్క విద్యార్థికే రోజూ వచ్చి పాఠాలు బోధిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం ఆహారం వండేందుకు ఓ నిర్వాహకురాలు కూడా పనిచేస్తున్నారు.

– కొత్తూరు

జవాన్ మృతితో విషాదం



పోలీసు లాంఛనాలతో నాగేశ్వరరావు అంత్యక్రియలు

సోంపేట: మండలంలోని తురకశాసనాం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వెదుళ్ల నాగేశ్వరరావు (58) గురువారం అరుణాచల్‌ప్రదేశ్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఈయన 28 ఏళ్లుగా జీఆర్ఈఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు రావడంతో వైద్యసేవలు అందజేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకొచ్చి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. నాగేశ్వరరావుకు భార్య కమలమ్మ, కుమారుడు ఆకాష్, కుమార్తె అనూష ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఆర్మీలోనే విధులు నిర్వహిస్తున్నాడు. నాగేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నారు.

చెరుకు తోట దగ్ధం



కాలిపోతున్న చెరుకు తోట

నరసన్నపేట: మండలంలోని మాకివలస–కిల్లాం మధ్య శుక్రవారం కోత దశలో ఉన్న పది ఎకరాల చెరుకు తోటకు మంటలు అంటుకున్నాయి. రైతులు గుర్తించి వెంటనే అప్రమత్తమైనా మంటలను నిలువరించలేకపోయారు. నరసన్నపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే మెజార్టీ తోట కాలిపోయిందని రైతులు నేతింటి కృష్ణ, బోడి రామన్న, యాళ్ల ప్రసాదరావు తెలిపారు. పది నెలలుగా తోటను కాపాడుకుంటూ వస్తున్నామని, ఇప్పుడు కాలిపోవడంతో సుమారు రూ. 8 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటోలు ఢీ.. ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ఆటో

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని 80 ఫీట్‌రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార మండలం అచ్చెన్నపాలెంకి చెందిన దుడ్డు మోహన్ శుక్రవారం మధ్యాహ్నం 80 ఫీట్‌రోడ్డులోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం నుంచి రాంగ్‌రూట్‌లో కలెక్టరేట్ వైపు అవతలి రోడ్డులోకి మలుపు తిప్పాడు. ఈలోగా అరసవల్లి మిల్లు జంక్షన్ నుంచి 80 ఫీట్‌రోడ్డు వైపు వస్తున్న మరో ఆటోను ఢీకొట్టాడు. రెండు ఆటోలు బోల్తాపడగా మోహన్‌కు గాయాలయ్యాయి. వేరే ఆటోలో ఉన్న మహిళా ప్రయాణికురాలికి స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ, వార్డు వలంటీర్లకు బకాయి వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.నరసింహమూర్తి డిమాండ్ చేశారు. రూ.10 వేల వేతన హామీ నెరవేర్చాలని, జాబ్‌చార్టు ప్రకటించాలని, ఎన్నికల ముందు రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లలో చాలా మంది డిగ్రీ చదివిన వారు ఉన్నారని, కేవలం రూ.5 వేల గౌరవ వేతనానికి ఐదేళ్లు పనిచెయ్యడానికి లక్షలాది మంది సిద్ధపడ్డారంటే నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో ఉందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. కనీస వేతనాలు, పని గంటలు, పని భద్రత, విధివిధానాలు ప్రకటించాలని కోరారు. వలంటీర్లు లేరని, ఇకపై తీసుకునే అవకాశం ఉండదని ఇటీవల మంత్రి చేసిన వ్యాఖ్యలు వెనుక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ధర్నాలో వలంటీర్లు డి.నరసింహమూర్తి, ఎ.రాంబాబు, ఎస్.భాస్కరరావు, అప్పలమ్మ, సవర సుజాత, ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

జి.సిగడాం: జిల్లాలో 7లక్షల 24వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా వ్యవసాయాధికారి (జేడీ) త్రినాథస్వామి తెలిపారు. శుక్రవారం జి.సిగడాం మండలం మర్రివలసలో రైతులు పండించిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 3 లక్షల 60 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు నమోదైందన్నారు. వీటిలో 3లక్షల 45 వేల మంది రైతుల ఈకేవైసీ చేసుకున్నట్లు చెప్పారు. ఈకేవైసీ చేయిస్తేనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని స్పష్టం చేశారు. 620 రైతు సేవా కేంద్రాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి 402 ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ధాన్యం సాధారణ రకం మద్దతు ధర రూ.2300, గ్రేడ్ 'ఎ' రకం మద్దతు ధర రూ.2320గా నిర్ణయించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఓ యర్రా శారద, సర్పంచ్‌లు విక్రం కోటిబాబు, మాజీ సర్పంచ్ మానం సత్యారావు, విక్రం సత్యారావు, విక్రం సందీప్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సింహాద్రి హరికృష్ణ, అలుగోలు లక్ష్మీనారాయణ, పాగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో జాప్యం తగదు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. వి. రమణమూర్తి

గార: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి ప్రశ్నించారు. శుక్రవారం దీపావళి ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాష్ట్రంలో 22 వేల పైబడి టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర విద్యాశాఖాధికారులు చూపించారని, కూటమి ప్రభుత్వంలో కేవలం 16, 347 పోస్టులకు డీఎస్సీ ప్రకటనకు సంతకం చేశారని, మిగిలిన ఆరు వేల పోస్టులు ఎందుకు ఖాళీగా ఉంచారని ప్రశ్నించారు. గూగుల్ ఫారాలు నింపడం, డిజిటల్ ఐడీలు తయారు చేయడం, డేటా సేకరణపై ఉన్న ఉన్న శ్రద్ధ విద్యాప్రమాణాలు పెంచడంలో, పాఠశాలల బలోపేతం చేయడంలో ఉంటే బాగుండేదని అధికారుల తీరును విమర్శించారు. అపార్ ప్రాధాన్యత అంశమే అయితే ఈ సంవత్సరం ఒకటో తరగతి నుంచి ప్రారంభిస్తే సరిపోయేదన్నారు. అన్ని రకాల ఆన్‌లైన్ డేటా నమోదులను తక్షణమే రద్దు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల నాయకులు కూన గడ్డెన్నాయుడు, విశ్వనాథం, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీచర్లకు నెలవారీ పదోన్నతులు చేపట్టాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులకు గతంలో మాదిరిగానే నెలవారీ పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినేని చందనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే చాలా మంది ఉపాధ్యాయులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. పని సర్దుబాటుకు యూడైస్ ప్రామాణికంగా తీసుకుంటే ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

ఇప్పటికే స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఉపాధ్యాయుల పిల్లల చదువులపై ప్రభావం చూపుతుందని చెప్పారు. టీచర్లు అవసరం ఉన్న చోట్ల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి ఆ లోటును భర్తీ చేయాలని కోరారు.

రేపు ఏపీఎస్‌టీఏ జిల్లా కార్యవర్గ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ టీచర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లాశాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి చిన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌జీవో హోమ్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే జిల్లా కార్యవర్గ సమావేశానికి ఏపీఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు హాజరవుతారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై చర్చించడంతోపాటు నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని తెలిపారు. జిల్లాశాఖ సభ్యులు, అభిమానులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యాన తోటల అభివృద్ధికి ప్రణాళికలు



పరిశోధనా స్థానం శాస్త్రవేత్త అశోక్

బూర్జ: కొబ్బరి, జీడి, మామిడి వంటి ఉద్యాన తోటలు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పెద్దపేటలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త పి.అశోక్ అన్నారు. శుక్రవారం పరిశోధనా స్థానంలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం ద్వారా రెక్కచిక్కుడు సాగుపై పరిశోధనలు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా గిరిజన గ్రామాల్లో జన్యు సంపదను గుర్తిస్తామని తెలిపారు. జిల్లాలో కొబ్బరి రైతులకు మొక్కలు అందుబాటులో ఉండేలా చేసిన పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. చీడపీడలు లేని దాదాపు ఏడు వేలు కొబ్బరి మొక్కలను అమ్మకానికి సిద్ధంగా ఉంచామన్నారు. ఉద్యాన పంటలు యాజమాన్యంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పెద్దపేట ఉద్యాన వన కేంద్రంలో సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానవన తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త టి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

కాశీబుగ్గ : ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ (పలాస) సౌజన్యంతో ఈ నెల 24న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్ వేదికగా జరిగే ఈ శిబిరానికి డాక్టర్ హెచ్.రాజ్‌కుమార్, డాక్టర్ అనూష హాజరై వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.